# జీవం లేని శిల్పం

రచయిత:
"శ్రీ వాసు"

నడిరేయిలో నాట్యాలుచేసే మిణుగురు పురుగుల మినుకు మినుకు కాంతులతో, రయ్యిమని గానంచేసే కీచురాళ్ళ అపశృతులతో, గర్జించే కారుమేఘాల కటిక చీకటిలో గలగలపారే సెలయేటితో మేఘాల్లోని మెఱుపులతోపాటు వినిపించే ఉరుముల ప్రతిధ్వనులతో,— అగాధమైన ఆ లోయ, అనంతమైన ఆ అటవీ ప్రదేశము, అల్లారు ముద్దుగా పెరిగిన ప్రకృతీమాత ప్రథమ పుత్రిక వలె కన్పించు చున్నది. ఆ ప్రకృతి వడిలో వేటకై అరుదెంచిన యువరాజు విజయుడు గుడారమందు మై మరచి నిద్రించు చున్నాడు. అతని పరివారమంతా వారి వారి గుడారములందు నిద్రాదేవి వడిలోమునిగి తేలుతున్నారు. రక్షక భటులు గుడారము ముందు విచ్చుకత్తులు చేతపట్టుకొని కూర్చున్న వారు కూర్చున్నట్లే కన్నులు మూసుకొని తూలుతున్నారు. మేఘాలు విచ్చుకపోయినాయి. చకోరాల గీతాలకు చంద్రుడు మేల్కొన్నాడు. వంపుసొంపులతో వయ్యారంగా ప్రవహించే సెలయేటి తరంగాలు చంద్రికలతో దాగుడు మూతలాడుచు మలుపులు తిరిగి పోతున్నాయ్! హెూరుమని వీచేగాలిలో "టక్ టక్" అనే శబ్దం స్ఫుటంగా వినిపించుతోంది. ఆ శబ్దంవిని విజయుడు లేచి కూర్చున్నాడు. ఆ వెన్నెలకాంతిలో, లోయనంతా నొక్కసారి పరికించి పరవశుడైనాడు. హఠాత్తుగా విజయుని దృష్టి దూరాన్నుంచి కనిపించే దీపపు కాంతిపై కేంద్రీకరింపబడ్డది. విజయుడు మెల్లగా వెలుగు కనిపించేవైపు బయలుదేరినాడు. అది విశాలమైన గుహ. అందొక శిల్పి త్రిలోకసౌందర్య రాశియైన శిల్పాన్ని చెక్కుచున్నాడు. ప్రతి అంగము, అత్యంత తేజోవంతమయి, సౌందర్య జీవకళలచే ప్రతి బింబించే ప్రతిమగా కన్పించు చున్నది. ఆ సర్వాంగ సుందరి రూపురేఖలనుగాంచి విజయుడు సంభ్రమాశ్చర్యాలతో ముగ్ధుడైనాడు. ఆ ప్రతిమ పాదాల ప్రక్కన ముద్దులుగొల్పె ముచ్చటైన శిశు ప్రతిమ కన్పించు చున్నది. శిల్పి చెక్కటం చాలించి నిరాశతో నిట్టూర్పువిడిచినాడు. "సుగంధీ! నీ ప్రియుని విరహవేదనాగ్ని చల్లార్చరావా! ఇంతకాలం నీ రాకకై నాకన్నులు కాయలుకాచినాయి! నీచనుపాలకై పసిబిడ్డ ఎలా ఏడ్చుచున్నాడో చూడు! ఆ బిడ్డతోపాటు నన్ను లాలించి పాలింపరావా! నాపయన దయలేదా! దేవీ!" అని శిల్పకారుడు ప్రతిమపాదాలను పట్టుకొని పసిపిల్లవానివలె వలవలా ఏడ్చినాడు. ప్రాణంలేని పాషాణ రాతికి ప్రాయంతో పరువులెత్తె పడుచు తనం సృష్టించిన శిల్పి, అనురాగంతో కరుడుగట్టిన కరుణను సృష్టించలేకపోయినాడు. అతని రగిలే ఆవేదనను చూచి విజయుని హృదయం కరుణతో పొంగి పొర్లింది. విజయుడు మూడడుగులు ముందుకేసి మృదువుగా ఆర్యా! ఎందుకలా బాధపడుచున్నారు," అని సానుభూతితో ప్రశ్నించినాడు. శిల్పి వెనుతిరిగి చూచినాడు. కన్నీరు అతని చెక్కిళ్లపైనుంచి జారిపోతున్నది. నీ వెవ్వరు! నాబాధ నీ వేమైనాతీర్చుతావా! అని శిల్పి గంభీరంగా పల్కినాడు.

"ఆర్యా! కావాలంటే నా ప్రాణాలనైనా బలిచేసి మీకోర్కె నెరవేర్చుటకు సిద్ధముగానున్నాను!" అని విజయుడు శిల్పి కన్నుల్లోకి చూచినాడు.

"అయ్యో! అది మానవులు సాధించలేనికార్యం! విధిలిఖించిన విధివ్రాత!" అని శిల్పి తన ముఖాన్ని రెండుచేతుల్లో దాచుకొని వెక్కి వెక్కి ఏడ్చినాడు.

"ఆర్యా! నేను కోసలదేశపు యువరాజును! నన్ను విజయుడందురు. నీ చిత్రకళగాంచి మా తండ్రి ముగ్ధుడై మిమ్ము గొప్పగా సన్మానించును! మా ఆస్థానమందు..." ఇంకా విజయుడు ఏమో అనపోయినాడు.

"యువరాజా! కళ కళ కోసము కాదు. కళ మానవజీవితానికి అమూల్యాభరణము. కళ ప్రపంచం కోసం! కళాకారుడు సౌందర్యాన్ని ఆరాధించుతాడు. దాన్ని సృష్టించుతాడు. సౌందర్యం ఆరాధించవలసిన వస్తువేకాని, అనుభవించ వలసిన వస్తువుకాదు. దాన్ని అనుభవించితే, ఆ వేదనతో అల్లాడిపోతాడు. రాజా! నీ కోర్కె తిరస్కరించినందుకు నన్ను క్షమించు! నాగాథవింటే నీవా కోరిక కోరివుండవు" అని శిల్పితన గాథచెప్పటం ప్రారంభించినాడు. "నా పేరు సుశర్మ! శిల్పకళా శాస్త్రమును బాల్యమునుంచి ఆమూలాగ్రముగా గ్రహించితిని. నేను వాంఛించే సౌందర్య వనితకై దేశ దేశములు, మూలమూలలు, గాలించినాను. నా కోర్కె ఫలించలేదు! ఒకనాటి వెన్నెల రేయిలో, యీ సెలయేటి వడ్డున శయనించినాను. నాకు స్వప్నమందు త్రిలోకసుందరియగు గంధర్వ కన్య కనిపించినది. ఆఅందాల రాశి దివ్యరూపం నాహృదయ ఫలకమందు గాఢంగా హత్తుకొన్నది.

సూర్యోదయమునలేచి, యీ కొండ రాతి యందొక గుహను తొలచితిని. అందు ఆమె మనోహర విగ్రహమును చెక్కుటకు మొదలుపెట్టితిని. ఒక్కొక్క అంగమును మాసముల కొలది విరామములేకుండా చెక్కుచుంటిని. ఒకనాటి సంధ్యాసమయంలో నేను నా పనియందు నిమగ్నుడనై యుంటిని. నా వెనుక గాజుల గలగల అందెల అలికిడి వినిపించెను. నేను తల త్రిప్పి చూచినాను. నన్ను నేనే నమ్మలేకపోయినాను. కలా! నిజమా! అని నాకు భ్రమకల్గింది. ఆ సుందరిని కన్నులారా తనివితీరునంత వరకు చూచినాను! ఎంతచూచినా, నా దప్పిక తీరలేదు. ఆమె కన్నుల్లోకి ప్రేమతోచూస్తు "నీవెవ్వరూ?" అన్నాను. "నేనా! సుగంధినిని! గంధర్వకన్యను. నీవు విరామము లేకుండా, అహోరాత్రాలు పూజించే శిల్పసుందరిని" అని చిరునవ్వు నవ్వింది. ఆ నవ్వులో నవరత్నాలు వెల్లివిరసినాయి. ఆ అందాన్ని చూచి ఆనందించలేకపోయాను! ఆమెను అనుభవించి, ఆనందించాలని ఆరాటపడినాను. "శిల్పకళానైపుణ్యానికి మర్త్యులేకాదు, అమరులు కూడా సంతసించి వేనోళ్ళ పొగడుతారు." అని సుగంధి తన ప్రతిమను నఖశిఖ పర్యంతం తిలకించినది. "రేపు తిరిగి సంధ్యా సమయంలో కలుసుకుంటా!" అని రివ్వున గాలిలో కలిసిపోయింది! మరుసటిరోజు మాట ప్రకారం సంధ్యావేళకు, రంభా, ఊర్వసీ, మేనకా, తిలోత్తమాది, అప్సరసలను కాలదన్నుదానివలె శృంగారించుకొని, సింగారముతో నాకన్నులముందు కూర్చున్నది. నాశరీరంలో వేడిరక్తం పొంగి పొర్లింది. ఆ సుందరిని అనుభవించలేని బ్రతుకెందుకని బాధపడినాను. నాలోదాగిన ప్రణయం నన్ను పరవశుణ్ణి చేసింది.

"దేవి! నీవు నాదానివి! నేను నీవాడిని! నీవులేకపోతే నా జీవితం నిరర్థకం! నీవు నాకళామతల్లికి ప్రప్రథమ పుష్పాంజలివి. నాఆరాధ్యదేవతవునీవే!" అని అనురాగంలోని ఆవేశంతో వళ్లు మరచి సుగంధిని కౌగలించుకొన్నాను. "స్వామీ! అపచారము. నన్ను విడువు" అని సుగంధి దీనముగా నాకన్నుల్లోకి దీనంగా చూచింది.

"విడవలేనుదేవి! విడచి క్షణం బ్రతుకలేను సఖీ!" అని మరింత గాఢంగా నాహృదయానికిహత్తుకొన్నాను. కొంతసేపటికి సుగంధి వివాహానికి వొప్పుకొన్నది. అందుకొక షరతు ప్రకటించినది. సెలయేటివొడ్డున కుటీరం నిర్మించమంది. పగలు నేను సుగంధిని చూడరాదని శాసించినది! రాత్రి నా అధీనమందు గడుపునట్లు వొప్పుకొన్నది! అందుకు నేను సమ్మతించి వాగ్దానము చేసినాను. రాత్రులందు సుగంధితో సుఖజీవనము గడుపుతు, కాలాన్ని గడుపుచుండేవాడిని. ఒకనాటి శుభ సమయమున సుగంధి, ముక్కుపచ్చలారని ముద్దుబిడ్డను ప్రసవించినది! అపిల్లవానికి సుధీర్ అని నామకరణము చేసినాము! దినమంతా అల్లారు ముద్దుగా నేను పోషించుచుండేవాని రాత్రులందు సుధీర్‌తోపాటి నన్ను సుగంధి ప్రేమతో లాలించి పాలించుచుండేది. ఒకనాటి పగటి సమయమందు సుధీర్ జబ్బువల్ల బాధను భరించలేక కెవ్వున ఏడ్చుటకు మొదలుపెట్టినాడు! ఆ పసికూన ఏడుపు వినడానికి అలవికాలేదు! నా సర్వశక్తులా సుధీర్‌ను లాలించేదానికి ప్రయత్నించినాను! ఆ బిడ్డఏడ్పు రానురాను మరింత ఎక్కువైపోయింది. బిడ్డ నెత్తుకొని కుటీరంవద్దకు పోయాను! "సుగంధీ! సుధీర్ వ్యాధివల్ల బాధపడుచున్నాడు! తలుపు తెరచి నీచేతుల్లోకి తీసుకొని లాలించుదేవి!" అని ప్రాధేయ పూర్వకంగా అడిగినాను.

"స్వామీ! మీరిచ్చిన వాగ్దానం మరచిపోకండి!" నన్ను పగటిసమయమందు మీరు చూడరాదు! నా మాట వినండి!" అని ప్రేమతో నన్ను సుగంధి కోరింది.

"అగడానికి వీలులేదు, నాబిడ్డబాధ చూడలేను. తలుపు తెరవకపోతే, నేను దాని పగులగొట్టి ప్రవేశించుతాను" అని గంభీరంగా పల్కినాను.

"స్వామీ నా మాటవిను. తదుపరి పాశ్చాత్తాపపడి లాభంలేదు"అని సుగంధి గద్గద కంఠంతో యింకా ఏమోచెప్పడం మొదలెట్టింది. ఆ మాటలు నేను వినిపించికోకుండా తలుపు బ్రద్దలు చేసి లోనికి పోయాను! నన్నుచూచి సుగంధి గాలిలో కలిసిపోయింది. స్వామీ! నీవు దినమంతా శిలా ప్రతిమవై, రాత్రంతా మామూలు స్వరూపంతో జీవించుతావు! ఇది మీరు చేసిన అపచారమునకు పొందిన ప్రతిఫలం" అని సుగంధి మాటలు వినిపించినాయ్! నాబిడ్డ కొద్దిసేపటికి మృత్యువు వడిలోకి జారుకొన్నాడు. ఇక మిగిలింది నేను! ఈ జీవంలేని శిల్పాన్ని అహోరాత్రులంతా ఆరాధించుతు ఆవేదనతో, అనంతమైన కాలవాహినిలో జీవితాన్ని గడుపుచున్నాను. నీ వల్ల నేను శిలామూర్తిగా నిలిచిపోతాను!" అని సుశర్మ, విజయుని వరలోని ఖడ్గాన్ని లాక్కొని తన హృదయంలో పొడుచుకొని నేల కొరిగినాడు. అతని రక్తధారలు జీవం లేని సుగంధి శిలాప్రతిమ పాదాలను పవిత్రంగా కడిగినాయి! కొద్ది సేపటికి సుశర్మ శాశ్వత శిలాప్రతిమగా మారిపోయినాడు. ఆ రెండు జీవంలేని శిలామూర్తులను విజయుడు వింతగాచూస్తు నిలుచు కొన్నాడు. ★